జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 137 | ఆదివారం 12 అక్టోబరు– 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## రైతుల శ్రేయస్సు కోసం

# లెక్కలేనన్ని సంస్కరణలు తెచ్చాం.. ప్రధాని మోదీ



న్యూఢిల్లీ:అక్టోబరు11(సందేశం టైమ్స్) : రైతులకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం నాడు జరిగిన ప్రత్యేక కృషి ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణతో రైతులు, దేశంలోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు.రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. మిగతా 2లో...

## కాలుష్య నియంత్రణ చర్యలు

# వేగవంతం చేయాలి.. పవన్ కల్యాణ్ ఆదేశాలు



అమరావతి,అక్టోబరు11(సందేశం టైమ్స్) : కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ (శనివారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షలో కాకినాడ జిల్లా యంత్రాంగం పాల్గొంది. ఉప్పాడ తీర ప్రాంతంలో కాలుష్య నియంత్రణ అంశాలపై దిశానిర్దేశం చేశారు పవన్ కల్యాణ్.కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట.. మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు పవన్ కల్యాణ్. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు.



## విశాఖలో మరో

# డేటా సెంటర్..

## రూ.87,520 కోట్ల పెట్టుబడి

(సందేశం టైమ్స్) :ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. రూ.50,000 కోట్ల పెట్టుబడితో వచ్చే ఈ డేటా సెంటర్‌తో 25 వేల మందికి ఉపాధి లభిస్తుంది. తాజాగా గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ ఏకంగా రూ.87,520 కోట్ల పెట్టుబడితో విశాఖలోనే డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. 11వ ఎస్ఐపీబీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం దీనికి ఆమోదం తెలిపింది. తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురంలో 3 క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి.

## ముస్లిం జనాభా పెరగడానికి అదే కారణం : అమిత్ షా



కోల్‌కతా,అక్టోబరు11(సందేశం టైమ్స్) : మన దేశంలో కొన్ని ప్రాంతాల్లో ముస్లిం జనాభా అసాధారణంగా పెరగడానికి అక్రమ చొరబాట్లే ప్రధాన కారణమని కేంద్ర హొంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కేవలం రాజకీయ సమస్య మాత్రమే కాదని, దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా పరిణమించిందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం 'దైనిక్ జాగరణ్' మాజీ ఎడిటర్ నరేంద్ర మోహన్ స్మారకోపన్యాసంలో 'చొరబాటు, మార్పు, ప్రజాస్వామ్యం' అనే అంశం షా ప్రసంగించారు. మిగతా 2లో...

# పుస్తకాలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి: పవన్ కల్యాణ్

## లక్ష్మీ పురి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన పవన్



పుస్తకాలు చదవడం వల్లే మానసిక పరిపక్వత వస్తుందన్న పవన్
పవన్ కల్యాణ్ తన అభిమాన నాయకుడని చెప్పిన మంత్రి సత్యకుమార్
పుస్తకాలు చదవడం ద్వారానే మానసిక పరిపక్వత సాధ్యమవుతుందని, తన జీవితంపై పుస్తకాల ప్రభావం ఎంతో ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఏ విషయంలోనైనా సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని, తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడానికి పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

(సందేశం టైమ్స్): ఐక్యరాజ్యసమితి పూర్వ సహాయ సెక్రటరీ జనరల్ లక్ష్మీ ముర్డేశ్వర్ పురి రచించిన 'ఆమె సూర్యుడిని కబళించింది' అనే పుస్తకాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఒక పుస్తకం చదువుతున్నప్పుడు ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటాం. ఏదైనా సాధించాలంటే పట్టుదల చాలా అవసరం. ఈ పుస్తకంలోని మాలతి పాత్ర నాకు ఎంతగానో స్ఫూర్తినిచ్చింది. ఆ పాత్రలో ధైర్యసాహసాలు, మేధస్సు, స్వాతంత్ర్య కాలం నాటి భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు కనిపిస్తాయి" అని వివరించారు. తన తల్లి వంట గది నుంచే ప్రపంచాన్ని చూశారని గుర్తుచేసుకున్నారు. భారతీయ ఆలోచనా విధానం నుంచే తాను వచ్చానని, మన దేశంలో స్త్రీకి అత్యున్నత గౌరవం ఉందని పవన్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ మహిళా విభాగానికి 'ఝాన్సీ వీర మహిళ' అని పేరు పెట్టినట్లు గుర్తుచేశారు. మిగతా 2లో...

## స్త్రీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్



విజయవాడ అక్టోబరు11(సందేశం టైమ్స్) బాలికలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినా, సోషల్ మీడియాలో తప్పుగా పోస్ట్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ హెచ్చరించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మిగతా 2లో...

## అలా ఉంటే

# జగన్ తట్టుకోలేడు...

## పల్లా షాకింగ్ కామెంట్స్



అమరావతి, అక్టోబరు11(సందేశం టైమ్స్) : కూటమి ప్రభుత్వం మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... విశాఖపటం దేశంలో అతిపెద్ద డేటా వ్యాలీగా మారుతుందని అన్నారు. విశాఖపట్నం వరల్డ్ డేటా సెంటర్‌గా మారబోతుందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడి దారులు వైసీపీ నాయకుల వల్ల భయపడిపోతున్నారని మండిపడ్డారు. 2047 లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వెల్లడించారు. మెడికల్ కాలేజీలు, స్టీల్ ప్లాంట్ ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్‌పరం కావని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీలు పూర్తి కావాలంటే 7,300 కోట్ల రూపాయలు కావాలన్నారు. కాలేజీలను పూర్తి చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వైసీపీపై ఫైర్ అయ్యారు. మిగతా 2లో...

# బజారురౌడీలా పేర్నినాని తీరు..

## మూల్యం చెల్లించుకోక తప్పదన్న మంత్రి



విజయవాడ, అక్టోబరు11(సందేశం టైమ్స్) : మాజీ మంత్రి పేర్నినానిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. బందరులో ఓటమికి పేర్ని నాని మతిస్థిమితం కోల్పోయి బజారు రౌడీలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఒకప్పుడు ప్రజా ప్రతినిధిని అనే విచక్షణ మరిచి పశువు కంటే హీనంగా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. కల్తీ మద్యం కేసులోనే పేర్ని నాని అరెస్టై జైలుకెళ్లిన సంగతి మరిచారా అని ప్రశ్నించారు. బందరులో తెలుగుదేశం నాయకుల్ని తాను కంట్రోల్ చేస్తున్నా కాబట్టి పేర్ని నాని ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు తమకు నేర్పిన క్రమశిక్షణ కారణంగానే తెలుగుదేశం శ్రేణులు సంయమనం పాటిస్తున్నారని వెల్లడించారు. మిగతా 2లో...

## కల్తీ మద్యం..

## జగన్‌పై వర్ల రామయ్య ప్రశ్నల వర్షం



అమరావతి,అక్టోబరు11(సందేశం టైమ్స్) : గత 6 సంవత్సరాలుగా రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారటానికి కర్త, కర్మ, క్రియ జగనే అని పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కల్తీ మద్యం కుట్రదారులను ప్రోత్సహిస్తూ, కల్తీ మద్యానికి మూల విరాట్ కూడా జగనే అని అన్నారు. జగన్ దాయాదులైన వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి సౌత్ ఆఫ్రికాలో మద్యం వ్యాపారం చేస్తున్నారనేది నిజం కాదా అని ప్రశ్నించారు. వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి.. జగన్ వ్యాపార బినామీలు అవునా, కాదా? అని నిలదీశారు. దాయాదుల మద్యం వ్యాపారంలో కల్తీ జరుగుతోందని సౌత్ ఆఫ్రికా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారనేది నిజం కాదా అని అన్నారు. వైసీపీ కోవర్ట్ జయచంద్రా రెడ్డి.. వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి క్యాంప్‌లో తలదాచుకున్నారనేది నిజం కాదా అని మరో ప్రశ్న సంధించారు.

(మొదటి పేజీ తరువాయి)

## రైతుల శ్రేయస్సు కోసం లెక్కలేనన్ని సంస్కరణలు తెచ్చాం.. ప్రధాని మోదీ

యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. గత ప్రభుత్వాలకు వ్యవసాయంపై ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన వివిధ శాఖలు ఇష్టారీతిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీనమవుతూ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజనాలు చేకూరే లెక్కలేనని సంస్కరణలు తెచ్చామని చెప్పారు.

## ముస్లిం జనాభా పెరగడానికి అదే కారణం : అమిత్ షా

కొన్ని రాష్ట్రాల్లోని జనాభా లెక్కలను ఉటంకిస్తూ అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అస్సాంలో ముస్లిం జనాభా పదేళ్లలో 29.6 శాతం పెరిగింది. చొరబాట్లు లేకుండా ఈ స్థాయిలో వృద్ధి అసాధ్యం. పశ్చిమబెంగాల్‌లోని పలు జిల్లాల్లో ముస్లిం జనాభా వృద్ధి రేటు 40 శాతం పెరిగింది. ఇక సరిహద్దు ప్రాంతాల్లో ఏకంగా 70 శాతం వరకు ఉందని అమిత్ షా తెలిపారు. దేశంలోకి ముస్లింల అక్రమ చొరబాట్లకు ఇది నిదర్శనమని అన్నారు.

కొన్ని రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్నాయని అమిత్ షా ఆరోపించారు. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు కూడా సరిహద్దులు ఉన్నాయి. మరి ఆ రాష్ట్రాల్లో చొరబాట్లు ఎందుకు జరగడం లేదు అని ఆయన ప్రశ్నించారు. చొరబాట్లను అడ్డుకోవడం కేవలం కేంద్ర ప్రభుత్వం, సరిహద్దు భద్రతా దళాల బాధ్యత మాత్రమే కాదని అన్నారు. దేశ భౌగోళిక పరిస్థితుల కారణంగా అన్ని సరిహద్దు ప్రాంతాల్లో కంచె వేయడం సాధ్యం కాదని, అలాంటి చోట్ల రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అత్యంత కీలకమని చెప్పారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని స్థానిక జిల్లా యంత్రాంగం గుర్తించడంలో విఫలమైతే చొరబాట్లను ఎలా ఆపగలమని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న చొరబాట్ల కారణంగానే జార?ండ్‌లో ఆదివాసీ జనాభా గణనీయంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

## బజారురౌడీలా పేర్నినాని తీరు..

టీడీపీ నాయకులు ఎక్కడ కంట్రోల్ తప్పుతారో అనే భయంతో వారిని రోజూ సముదాయించాల్సి వస్తోందన్నారు. ఇదే తీరు కొనసాగితే పేర్ని నాని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. టీడీపీ శ్రేణులతో తన్నులు తిని సానుభూతి పొందాలని పేర్ని నాని భావిస్తున్నాడేమో అంటూ ఎద్దేవా చేశారు. పేర్ని నాని ఆగడలపై న్యాయ సలహా తీసుకుని చట్టపరంగా ముందుకెళ్తున్నామన్నారు. అతని అసత్య ప్రచారాలపై పరువు నష్టం దావా కూడా వేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## పుస్తకాలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి: పవన్ కల్యాణ్

ఇదే వేదికపై పవన్ కల్యాణ్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను త్వరలోనే అమలు చేయబోతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, "పవన్ కల్యాణ్ నా అభిమాన నాయకుడు. నేను ఈ రోజు మంత్రిగా కాకుండా సాధారణ వ్యక్తిగా వచ్చి ఉంటే, మీ అందరితో కలిసి కింద కూర్చుని 'పవర్ స్టార్', 'ఓజీ' అని గట్టిగా అరిచేవాడిని" అని తన అభిమానాన్ని చాటుకున్నారు. మంత్రి వ్యాఖ్యలతో సభలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## స్త్రీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్

=యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్, ఏపీ మహిళా కమిషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ పాతబస్తీ (వన్ టౌన్) లోని కేబీఎన్ కళాశాలలో స్పాట్ లైట్ సెషను శుక్రవారం నిర్వహించారు. %ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన అనంతరం రాయపాటి శైలజ మాట్లాడుతూ చిన్నారులు, బాలికలు, మహిళలు స్వేచ్ఛగా, సంతోషంగా జీవించే హక్కు కలిగి ఉన్నారని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. బాలికలు, మహిళలు చదువుకునే సమయంలో, ఉద్యోగ విధుల్లో ఉన్న సమయంలో ఎటువంటి భయం లేకుండా జీవితం కొనసాగించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పని ప్రదేశంలో అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు రాష్ట్ర మహిళా కమిషన్ విధులు, విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాయపాటి శైలజ సూచించారు. మహిళలు, బాలికలు స్వయంగా తమ కార్యాలయానికి రాలేని పరిస్థితులు ఉండటం, మరొక సందర్భంలో తమ వివరాల గోప్యత వంటి విషయాలను గుర్తించి ఆన్లైన్ పోర్టల్ను సిద్ధం చేస్తున్నామన్నారు.

## అలా ఉంటే జగన్ తట్టుకోలేడు...

### పల్లా షాకింగ్ కామెంట్స్

పీపీపీ విధానం వల్ల ఎవరికి నష్టం జరగదన్నారు. లిక్కర్ వ్యవహారంలో తాము ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని అన్నారు. గత పాలకులు చేసిన పాపాలే ఇప్పుడు శాపాలయ్యాయని విమర్శించారు. అక్రమ లిక్కర్ వ్యవహారంలో ఎంతటి వారున్నా కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బొత్స సత్యనారాయణ అంటే తమకు ఎనలేని గౌరవం ఉందని.. బొత్సకు జగన్ వల్లే ప్రాణహాని ఉందన్నారు. కూటమి నాయకుల నుంచి కానీ.. ప్రభుత్వం వల్ల కానీ బొత్స కి ఎటువంటి హాని లేదని తెలిపారు. ఇటీవల కాలంలో శాసనమండలిలో బొత్స సత్యనారాయణ బాగా ఫోకస్ అవుతున్నారని చెప్పారు. బాబాయ్‌ను ఎవరు చంపారో అందరికీ తెలుసని అన్నారు. తనని దాటి వెళ్లిపోతున్నారంటే జగన్ తట్టుకోలేరంటూ పల్లా శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు.

## వైభవంగా రాయికోడ్ హనుమాన్ మందిరం మొదటి వార్షికోత్సవం





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 11అక్టోబర్: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలకేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం మందిర మొదటి వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు మాన్య సూక్తంతో స్వామివారికి అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వస్తి వచనం, నవగ్రహ మండలం, దేవత ఆహ్వానం, సర్వతోభద్ర మండలం, ముఖ్య దేవత స్థాపన, మహాగణపతి హోమం, రుద్రమన్యు హోమం వంటి శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. అనంతరం మహా హారతితో కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో భక్తులు కిటకిటలాడింది.

## జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ ఎఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను పరామర్శించారు





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 11అక్టోబర్: జహీరాబాద్ లోక్‌సభ సభ్యుడు శ్రీ సురేష్ కుమార్ శెట్కార్ , ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు శ్రీ మల్లికార్జున్ ఖర్గే గారిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల ఖర్గే స్వల్ప అస్వస్థతకు లోనైన నేపథ్యంలో, ఆయన ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని శెట్కార్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు తెలంగాణ రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ శ్రేణుల స్థితిగతులు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష జరిపినట్టు సమాచారం. ఈ భేటీ సానుకూల వాతావరణంలో ముగిసిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## పంచాయతీ కార్మికులుగా పనులు చేస్తున్న కాలనీవాసులు

### -మురికి కాలువతో టైఫాయిడ్, మలేరియా వచ్చాయని ఆవేదన

సందేశం టైమ్స్: సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి అక్టోబర్ 11: కొడిపల్లి మండలం మహమ్మద్ నగర్ గ్రామంలోని బీసీ వాడలో పంచాయతీ కార్యదర్శి మురికి కాలువలు తీయించలేదని కాలనీవాసులు కలిసి తామే సొంతగా పనులు వదిలేసుకుని ప్రైవేటు ట్రాక్టర్లో ముళ్లపొదలు,మురికిని శుభ్రం చేస్తున్నారు. కాలనీకి చెందిన సుమారు 15 మంది మురికి కాలువ పనులను శుభ్రం చేసుకున్నారు. గత కొన్ని రోజులుగా మురికి కాలువ మట్టితో నిండిపోయి తమ ఇండ్లలోని మురికి నీరు వెళ్లకుండా ఇంటి ముందే నిండిపోవడంతో దోమలు, పందులు చేరడంతో ఇండ్లలో తమ పిల్లలకు తమకు టైఫాయిడ్, మలేరియా జ్వరాలు వచ్చి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు పంచాయతీ కార్యదర్శి గ్రామ కార్మికులకు అధికారులకు విన్నవించినప్పటికీ మురికి కాలువ శుభ్రం చేయమని చెప్పడంతో కాలనీవాసులు తామే స్వయంగా రూ.5వేలతో ట్రాక్టర్ కి వెచ్చించి తాము మురికి కాలువ శుభ్రం చేసుకున్నారు. తమ కాలనీ పట్ల పంచాయతీ కార్యదర్శి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో తెలియడం లేదని జిల్లా అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి చెప్పగా మురికి కాలువ శుభ్రం చేయాలని విన్నవించినప్పటికీ మీ కాలనీకి మురికి కాలువ శుభ్రం చేయనని ఎవరికైనా చెప్పుకుంటే చెప్పుకోమని నేను గ్రామపంచాయతీకి రావడం సంతకాలు పెట్టి వెళ్లిపోవడమే నా పని అంటూ నిర్లక్ష్య సమాధానం చెప్పాడని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు.

## ప్రపంచ తెలుగు మహాసభలు.. పెయింటింగ్స్‌కు ఆహ్వానం




గుంటూరు, 11 అక్టోబర్ సందేశం టైమ్స్:: గుంటూరులో నిర్వహిస్తున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు వేదికగా అద్భుతమైన చిత్ర కళా ప్రదర్శన నిర్వహిస్తున్నామని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డా. గజల్ శ్రీనివాస్ వెల్లడించారు. 2026, జనవరి 3, 4, 5 తేదీల్లో ఈ ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతాయని వివరించారు. అందులో భాగంగా స్థానిక శ్రీ సత్యసాయి స్పిర్చివల్ సిటీ ప్రాంగణంలో 'మన అమరావతి' పేరుతో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో తెలుగు సంస్కృతి, తెలుగు భాషా వైభవం, ఆంధ్రప్రదేశ్ కీర్తి, పర్యావరణంతోపాటు ప్రకృతి సౌందర్యం తదితర అంశాలను ప్రతిబింబించే "చిత్రకళా కృతులను" ప్రదర్శించేందుకు వర్ధమాన, ప్రముఖ చిత్రకారులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. అయితే ఈ ప్రదర్శనలో ఏఐ ద్వారా రూపొందించిన చిత్రాలను మాత్రం అనుమతించబోమని స్పష్టం చేశారు. ఇక ఈ ప్రదర్శనలో పాల్గొనే ప్రతీ కళాకారునికి ప్రశంసా పత్రంతోపాటు ఈ మహాసభల అభినందన పతకం అందిస్తామని వివరించారు. చిత్రకారులు తమ చిత్రాలను కింద చిరునామాకు 2025, డిసెంబర్ 15వ తేదీ లోపు పంపాల్సి ఉంటుందని ఈ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కింది చిరునామాకు పంపాలని సూచించారు.

# వర్షమొచ్చిన ప్రతిసారీ ఇబ్బందులు



**తేనెబండ సర్కిల్లో కల్వర్టును శుభ్రం చేస్తున్న పొక్లయినర్- వీధుల్లో నీటిప్రవాహంతో నీవానది కాలనీవాసుల ఇబ్బందులు**

చిత్తూరు అర్బన్,అక్టోబరు11 (సందేశం టైమ్స్): ఎగువ ప్రాంతాలతో పాటు చిత్తూరు సమీప మండలాల్లో భారీ వర్షం కురిసిన ప్రతిసారీ నగరంలోని నీవా పరివాహక ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. పరివాహక ప్రాంతవాసుల్ని శాశ్వతంగా వేరేచోటుకు తరలిస్తామని వర్షమొచ్చినప్పుడనల్లా చెప్పే అధికారులు, ప్రజాప్రతినిధులు వర్షం ఆగాక ఆ మాటను మరిచిపోతున్నారు.భారీ వర్షాలు పడినప్పుడు స్థానికులను ఇతర ప్రాంతాలకు తరలించి ఆశ్రయంతో పాటు ఆహారాన్ని అందించడం పరిపాటిగా మారిపోయింది.ఆక్రమణలను తొలగించి, రక్షణ గోడ నిర్మిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాలతో పాటు పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా నీవానది పొంగి పొర్లుతోంది.చిత్తూరు నగరంలోని పోతంబట్టు వద్ద నీవానది ప్రారంభమై ఎన్టీయార్ జలాశయం వరకు కొనసాగుతోంది. నదీ పరివాహక ప్రాంతాలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటు నదికి వచ్చే తూములు మూసుకుపోయాయి. వర్షాల సీజన్‌కు ముందు ఇరిగేషన్‌శాఖ, నగరపాలక అధికారులు నదిలోని ముళ్లకంపలు, ఇతర వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. కానీ అది చేయడంలేదు.దీంతో భారీ వర్షాలు పడిన ప్రతిసారీ నీవానదిని ఆనుకుని వున్న వీరభద్రకాలనీ, రిక్షా కాలనీ, తేనబండ, తోటపాళ్యం, దోబీఘాట్, కైలాసపురం ప్రాంతా లు జలమయమవుతున్నాయి. శుక్రవారం కూడా అక్కడి ఇళ్లలోకి వర్షపు నీరు చేరిపోయింది.చాలా ఇండ్లలోని సామాన్లు, సరుకులు తడిసిపోయాయి.ద్విచక్రవాహనాలు పాడైపోయాయి.

# నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె పాక్షికం




అమరావతి, అక్టోబరు11 (సందేశం టైమ్స్): ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ శుక్రవారం చేపట్టిన నెట్‌వర్క్ ఆస్పత్రుల వైద్య సేవల బంద్ పాక్షికంగా జరిగింది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ తమకు రూ.2700 కోట్ల బకాయిలు పెట్టిందని, బిల్లులు చెల్లించే వరకూ సేవలు కొనసాగించలేమంటూ నుంచి సమ్మెకు పిలుపునిచ్చింది. అయితే సమ్మె ప్రభావం పెద్దగా కనిపించలేదు. నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి శస్త్ర చికిత్సల కోసం ప్రతిరోజూ అనుమతులు కోరుతూ ట్రస్ట్‌కు దాదాపు 6 వేల నుంచి 6500 వరకు ప్రి-ఆథరైజేషన్లు వస్తాయి. వీటికి ట్రస్ట్ అనుమతులిస్తుంది. శుక్రవారం కూడా 6 వేల ప్రి-ఆథరైజేషన్లు ఆసుపత్రుల నుంచి వచ్చాయి.

# షెడ్యూల్ ప్రకారం జరగని కౌన్సెలింగ్



తిరుపతి (విద్య), అక్టోబరు11 (సందేశం టైమ్స్): షెడ్యూల్ ప్రకారం జరగని కౌన్సెలింగ్‌తో గంటలకొద్దీ నిరీక్షిస్తూ కొత్త టీచర్లు ఇబ్బంది పడ్డారు. ఇందులో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమూ కనిపిస్తోంది. మెగా డీఎస్సీ కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన 1403 మంది టీచర్లలో 1394 మంది చిత్తూరు, తిరుపతి, గూడూరులోని ఆరు కేంద్రాల్లో ఎనిమిది రోజుల పాటు.. అక్కడే ఉండి శిక్షణ పూర్తి చేసుకున్నారు. శిక్షణ కాలంలోనే చివరి రెండు రోజులు వెబ్, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి, వీరికి పోస్టింగులు కేటాయించాలి. దీనికిగాను ఎస్జీటీలకు మధ్యాహ్నం 3 నుంచి మాన్యువల్, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. సాయంత్రం 4 గంటలకు పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. జిల్లాలో మాత్రం దీనికి భిన్నంగా జరగడం.. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. ఎందుకంటే.. తిరుపతి నగరం జీవకోనలోని విశ్వం స్కూల్‌లో మాన్యువల్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లను తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు పూర్తి చేశారు. కౌన్సెలింగ్ నిర్వహణకు లాగిన్ అధికారమున్న చిత్తూరు డీఈవో వరలక్ష్మి వివిధ కారణాలతో రాత్రి 10.30 గంటలకు వచ్చారు. దీంతో అర్ధరాత్రి 11 గంటల తర్వాత మొదలై.. శుక్రవారం వేకువ జాము 4 గంటలకు వరకు 250 మందికి కౌన్సెలింగ్ పూర్తి చేశారు. షెడ్యూల్ ప్రకారం మిగిలిన వారికి శుక్రవారం ఉదయం 8.30 గంటలకు తిరుపతి రూరల్ ప్రాంతంలోని మెడ్‌జీ స్కూల్లో 450 మందికి కౌన్సెలింగ్ ప్రారంభించాలి. కానీ, 4.30 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలు పెట్టి రాత్రి పది గంటలకు కౌన్సెలింగ్ పూర్తయింది. ఇక, గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో 175 మంది ఎస్జీటీలకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చిత్తూరు కేంద్రంలో స్కూల్ అసిస్టెంట్లకు మూడు గంటలు ఆలస్యంగా.. సాయంత్రం 6 గంటలకు మొదలైన వెబ్ కౌన్సెలింగ్ రాత్రి 11.30 గంటల వరకు కొనసాగింది. ఇలా షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్ జరగకపోవడానికి సాంకేతిక సమస్యలూ కారణమని అధికారులు చెబుతుండటం గమనార్హం.

# ఉత్తరాంధ్రలో భారీగా వర్షాలు..



విశాఖపట్నం, అమరావతి, అక్టోబరు11 (సందేశం టైమ్స్): ఉత్తర కోస్తా, ఉత్తర తమిళనాడు పరిసరాల్లో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు ఏర్పడ్డాయి. వీటి ప్రభావంతో కోస్తా, సీమల్లో పలుచోట్ల ఉరుములు, పిడుగులతో వర్షాలు కురిశాయి. రాత్రి నుంచి శనివారం ఉద యం వరకు అక్కడక్కడా భారీవర్షాలు కురవనున్నాయి. శని, ఆదివారాలు కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, బంగ్లాదేశ్, దానికి ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దాని ప్రభావంతో గాలుల దిశ మారుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. శనివారం అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, చిత్తూ రు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం సాయంత్రం వరకు కోనసీమ జిల్లా నగరంలో 46, మలికిపురంలో 36, ప్రకాశం జిల్లా నర్సింగోలులో 27, కాకినాడజిల్లా డీ-పోలవరంలో 25.2 మిల్లీమీటర్ల వాన పడింది.

# ప్లీజ్ సేవ్ గర్ల్ చైల్డ్




ఇంటర్నెట్ డెస్క్: అక్టోబరు11 (సందేశం టైమ్స్):అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం (ఈ నెల 11న) సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు చెందిన దేవిన సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్) 'ప్లీజ్ సేవ్ గర్ల్ చైల్డ్'.. మాపై అకృత్యాలకు అంతం లేదా? అన్న నినాదాలతో సైకత శిల్పం రూపొందించారు. భయంతో ముడుచుకుపోయిన బాలికను అబార్షన్లు, అత్యాచారాలు, లింగవివక్ష, బాల్య వివాహాలు చుట్టుముట్టినట్టు రూపొందించిన ఈ సైకత శిల్పం చూపరులను ఆలోచింపజేస్తోంది.

# రెండు ఏనుగులకు రేడియో కాలరింగ్ బెల్ట్



**దామలచెరువు బీట్‌లో గజసంచార ప్రాంతాలను పరిశీలిస్తున్న రాకేష్, అటవీ శాఖ అధికారులు**

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు11 (సందేశం టైమ్స్): అటవీ ప్రాంతాల సమీపంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏనుగుల సంచారం అరికట్టేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కౌండిన్య అభయారణ్యంలో సంచరిస్తున్న రెండు ఏనుగులకు రేడియో కాలరింగ్ బెల్ట్ ఏర్పాటు చేసే ప్రయత్నంలో పడ్డారు. నాలుగేళ్ల క్రితం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో ఎంపిక చేసిన ఏనుగులకు దీన్ని ఏర్పాటు చేయాలని భావించినా, సాంకేతిక సమస్యల కారణంగా వీలు కాలేదు. ఈ నేపథ్యంలో వైల్డ్ లైఫ్ ఎక్స్‌పర్ట్ రాకేష్ శుక్రవారం చిత్తూరు ఈస్టు, వెస్టు, పనపాకం ప్రాంతాల్లోని ఎఫ్ఆర్వోలు, డీఆర్వోలు, ఎఫ్ఎసఓలు, ఓఫ్‌బీవోలు, 14 మంది ఎలిఫెంట్ ట్రాకర్లతో కలిసి దామలచెరువు బీట్‌లో ఏనుగుల సంచార ప్రాంతాలను పరిశీలించారు. పలమనేరు ప్రాంతంలోనూ పరిశీలించారు. పలమనేరు ప్రాంతంలో తిరుగుతున్న ఒంటరి ఏనుగుతో పాటు పులిచెర్ల, దామలచెరువు, కల్లూరు ప్రాంతాల్లో తరచూ సంచరిస్తున్న ఏనుగుల గుంపులో ఒక ఏనుగుకు రేడియో కాలరింగ్ బెల్ట్ అమర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ బెల్ట్ ద్వారా జియో ట్రాకింగ్ సిస్టమ్‌ను ఆయా అటవీ పరిసర ప్రాంతాల ఎఫ్ఆర్వోలు, డీఆర్వోలు, ఎఫ్ఎసఓల మొబైల్స్‌కు అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా ఏనుగులు ఏ సమయంలో ఏ ప్రాంతంలో సంచరిస్తున్నాయి, ఎక్కడ ప్రమాదం పొంచి ఉందనే విషయాలను పసిగట్టే వీలుంది.దీంతో ఆయా ప్రాంతాల్లోని అటవీ సిబ్బందిని, ఎలిఫెంట్ ట్రాకర్లను అప్రమత్తం చేస్తారు. వారు వెంటనే ప్రాంతానికి చేరుకుని, ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రయత్నం చేస్తారు.

# గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవితఖైదు



సూళ్లూరుపేట, అక్టోబరు11 (సందేశం టైమ్స్): తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో 2019 నాటి గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లాకోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ తీర్పు చెప్పారు. సూళ్లూరుపేట బొగ్గుల కాలనీకి చెందిన తిరువళ్లూరు నవీన్‌కుమార్, సాయినగర్‌కు చెందిన కేకుల దేవకు జీవిత ఖైదుతో పాటు నగదు దోపిడీకి పాల్పడినందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో పనిచేస్తున్న విజయనగరానికి చెందిన యువతి, కాకినాడకు చెందిన యువకుడు ప్రేమించుకుంటున్నారు. 2019 ఫిబ్రవరి 3న రాత్రి 10.30 గంటల సమయంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ చివర్లో కూర్చొని వీరు పెళ్లి విషయమై మాట్లాడుకొంటున్నారు. అదే సమయంలో నలుగురు యువకులు అతడిపై దాడిచేసి నగదు లాక్కున్నారు. ఆ యువతిని కాస్త దూరం లాక్కెళ్లి గ్యాంగ్‌రేపకు పాల్పడ్డారు. మళ్లీ ఆమెను తడ మండలం అక్కంపేట రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేసి పరారయ్యారు. అప్పట్లో ఈ గ్యాంగ్‌రేప్ సూళ్లూరుపేటలో సంచలనం రేపింది. అప్పటి సీఐ కిషోర్ బాబు,పోలీసులు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ మురళీకృష్ణ, కోర్ట్ లైజన్ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కే ఖాజాహుస్సేన్ సాక్ష్యాలను సరైన సమయంలో సమర్పించి నేరం రుజువు కావడానికి కృషి చేశారు. ప్రాసిక్యూషన్ తరపున తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఫీ మాలిక్ వాదనలు వినిపించారు. మహిళలు, చిన్నారులపై అత్యాచారం, వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు.

# ఇద్దరు విద్యార్థుల దుర్మరణం



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు11 (సందేశం టైమ్స్): ద్విచక్ర వాహనంపై అతివేగంతో వచ్చిన ఇద్దరు యువకులు.. అదుపు తప్పి తిరుపతిలోని గరుడ వారధిపై నుంచి పడి దుర్మరణం చెందారు. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి కథనం మేరకు.. చంద్రగిరి మండలం కందులవారిపల్లెకు చెందిన రాజ్‌కుమార్ నాయుడి ఏకైక కుమారుడు కనిష్క(22), ఇతడి స్నేహితుడు, కొటాలకు చెందిన వాచువా కొమ్మినేని(23) చంద్రగిరి మండంలోని ఓ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నారు. వీరిద్దరూమధ్యాహ్నం చంద్రగిరి నుంచి బుల్లెట్‌లో బయలుదేరి.. మామిడి కాయల మండీ వద్ద గరుడ వారధిపైకి ఎక్కారు. అతివేగంగా వస్తున్న వీరు లక్ష్మీపురం సర్కిల్ వద్ద అదుపు తప్పి ఎడమ వైపు వున్న గ్రిల్ డివైడర్‌ను ఢీ కొన్నారు. దాదాపు రెండు అడుగుల ఎత్తు ఎగిరి వారధిపైనుంచి దాదాపు 30 అడుగుల కింద రోడ్డుపై పడ్డారు. ఒకరు వినాయకస్వామి గుడి వద్ద, మరొకరు పెట్రోలు బంకు వద్ద పడి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారంతో ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి, ఏఎసఐ అశోక్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 108లో మృత దేహాలను రుయాస్పత్రికి తరలించారు.కనిష్క బావ సురేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ హేమాద్రి కేసు నమోదు చేశారు. బుల్లెట్‌ను పోలీసులు సీజ్ చేశారు. రుయా అత్యవసర విభాగం వద్ద ఇద్దరు కుటుంబీకులు, బంధువులు, తోటి విద్యార్థుల రోదనలు అందరినీ కలచివేసింది.

# సత్యదేవుడికి బస్సు విరాళం



అన్నవరం, అక్టోబరు11 (సందేశం టైమ్స్): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీనివాసులు శెట్టి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానానికి విచ్చేసే భక్తులకు రవాణా సౌకర్యం కోసం 32 సీట్లు సామర్థ్యం కలిగిన సుమారు రూ.25 లక్షల విలువైన బస్సును విరాళంగా అందజేశారు. ఈ బస్సు తాళాలను ఎస్‌బీఐ చైర్మన్ దేవస్థానం ఈవో, చైర్మన్‌కు అందజేశారు. ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ పటేల్, హేమంత్‌కుమార్, పంకజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అదానీ కంపెనీ సిబ్బందిని అడ్డుకున్న సిపిఎం



చిలకలూరిపేట అక్టోబరు11 (సందేశం టైమ్స్):: స్థానిక పండరిపురం 3వ లైనులో స్మార్ట్ మీటర్ బిగించడానికి వచ్చిన అదాని కంపెనీ సిబ్బందిని అడ్డుకున్నట్లు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ తెలిపారు. ఇప్పుడైతే ఉచితం.. తర్వాత బిగించుకోవాలంటే రూ.10 వేలు అవుతుందటూ వినియోగదార్లను భయపెట్టి మీటర్ల బిగిస్తున్నారని, ఇతర పూర్తి వివరాలేమీ చెప్పడం లేదని అన్నారు. కొన్నిళ్లలో అయితే అడగకుండాకూడా పెడుతున్నారని తెలిపారు. అదానీ కంపెనీ సిబ్బంది మాటలు నమ్మి కొంతమంది మీటర్లు బిగించుకుంటున్నా వాటి గురించి తెలిశాక మంత్రి వద్దంటున్నారని, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేస్తామంటున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ పెట్టాక విద్యుత్ అసలు వాడకున్నా రూ.160 బిల్లు వచ్చినట్లు ఒక వినియోగదారుడు వాపోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# పచ్చకామెర్లు బారిన ఏకలవ్య విద్యార్థులు



కురుపాం :అక్టోబరు11 (సందేశం టైమ్స్): మండల కేంద్రంలో గల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇద్దరు పచ్చకామెర్ల బారిన పడి మృతి చెందగా, సుమారు 170 మంది చికిత్స పొందుతూ, డిశ్చార్జ్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో గురుకులానికి పక్కనే ఉన్న ఏకలవ్య పాఠశాలలో 360 మంది విద్యార్థులు ఉండగా వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించగా ప్రస్తుతం 30 మంది విద్యార్థులు పచ్చకామెర్లు, వైరల్ జ్వరాల బారిన పడ్డారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 17 మంది, కెజిహెచ్‌లో ఇద్దరు, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నలుగురు విద్యార్థులు చికిత్స పొందుతుండగా, ఏడుగురు విద్యార్థులు డిశ్చార్జ్ అయినట్లు ఏకలవ్య పాఠశాల సిబ్బంది సమాచారం ఇచ్చారు. ఇంకా మిగతా విద్యార్థుల పరిస్థితిపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

# దారికాచి దోపిడీ

నరసన్నపేట, అక్టోబరు11 (సందేశం టైమ్స్): వారంతా హిజ్రాలు.. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డుపైకి నలుగురైదుగురు మూకమ్మడిగా వస్తారు. ద్విచక్ర వాహనాలపై, కారులపై వచ్చేవారిని ఆపి యాచకం చేస్తారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోతే వారిపై దాడి చేసి దోచుకుంటారు. ఇలా పలు ప్రాంతాల్లో ఐదుగురు హిజ్రాలు.. వారి కారు డ్రైవరు దోపిడీలకు పాల్పడుతుంటారు. వీరిని నరసన్నపేట పోలీసులు చాకచక్యంగా పట్టుకొని కటకటలాకు పంపించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రాత్రి టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 3న నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన జవాన్ దొంపాక అనంద రమణ ద్విచక్ర వాహనంపై నరసన్నపేట వెళుతుండగా.. ఉర్లాం ఉన్నత పాఠశాల సమీపంలో ఐదుగురు హిజ్రాలు అతడిని అడ్డగించి డబ్బులు అడిగారు. డబ్బులు ఇచ్చేందుకు అతడు నిరాకరించడంతో అతడి మెడ లో ఉన్న బంగారం చైన్ బలవంతగా తీసుకున్నా రు. ఈ ఘటనపై ఆనంద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసుల ఆ దిశగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్ తన సిబ్బందితో మడపాం టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ కారులో ఐదుగురు హిజ్రాలు రావడాన్ని గమనిం చారు. వారిని విచారిస్తుండగా పోరిపోయేందుకు ప్రయత్నించారు. సిబ్బంది అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బండారం బయటపడింది. ఈ వ్యవహారంలో నందిగాం నేహ, మండల శ్రావణి, అల్లుబిల్లి ప్రియ, బేదంపూడి సాయిపల్లివి, నాగిరెడ్డి సుష్మ, డ్రైవర్ సేలం రామప్రవీణ్ అరెస్టు చేశారు. వారి నుంచి 32 గ్రాముల బంగారు ఆభరణాలు, హొండా సిటీకారు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఈ ముఠా శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాలో పలు దోపిడీలకు పాల్పడినట్టు విచారణలో తేలిందన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు

# తీర కవచం కకావికలం

## గుంటూరు జిల్లాలో యథేచ్ఛగా మడ అడవుల నరికివేత

## అటవీ భూముల్లో రొయ్యల చెరువులు

## చోద్యం చూస్తున్న అటవీ అధికారులు



అక్టోబరు11 (సందేశం టైమ్స్):సముద్ర తీర ప్రాంత రక్షణ కవచం కకావికలమవుతోంది. విచ్చలవిడి నరికివేతతో మడ అడవులు కనుమరుగవుతున్నాయి. పచ్చని ప్రహరీలా తుఫానులు, ఉప్పెనల వంటి ప్రకృతి విపత్తుల నుంచి తీర ప్రాంతాలను కాపు కాసే మడ చెట్లు మోడుబారిపోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 37 వేల హెక్టార్లలో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ముఖ్యంగా రేపల్లె మండలం లంకేవానిదిబ్బ, మోళ్లగుంట, తాళ్లతిప్ప, నిజాంపట్నం మండలం కొత్తపాలెం, అడవులదీవి, దిండి, నిజాంపట్నం ప్రాంతాలు మడ అడవులకు ప్రసిద్ధి. మడ అడవులను ఇష్టానుసారంగా నరికివేస్తూ కొందరు దళారులు రొయ్యల చెరువులు సాగు చేసుకుంటున్నారు.

గత టీడీపీ హయాంలో ప్రత్యేక దృష్టి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మడ అడవుల అభివృద్ధిపై 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. తీర ప్రాంతాల్లో మడ మొక్కలను నాటి అడవులను విస్తరించింది. దీంతో మడ అడవులకు జాతీయ స్థాయిలో అవార్డు కూడా దక్కింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ దృష్టి సారించకపోవడంతో ఇష్టానుసారంగా మడ చెట్లను నరికివేశారు. ఈ కలపను తీసుకెళ్లి రొయ్యల చెరువుల గట్లపై కంచెగా నాటుకునేందుకు వినియోగిస్తున్నారు. వంట చెరకుగా విక్రయిస్తున్నారు. మడ అటవీ భూములను కొందరు భారీగా ఆక్రమించి రొయ్యల చెరువులను సాగు చేస్తున్నారు. స్థానికంగా నివాసం ఉంటూ రేపల్లె, నిజాంపట్నం మండలాల్లోని తీర ప్రాంతాల్లో మడ అడవుల బాగోగులు చూసుకోవాల్సిన అటవీ శాఖ అధికారులంతా బాపట్ల, గుంటూరు జిల్లా కేంద్రాలకే పరిమితమయ్యారు. ఉన్నతాధికారులు సందర్శనకు వచ్చినప్పుడు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోతున్నారు. మడ అడవుల రక్షణపై వారు దృష్టి సారించిన దాఖలాల్లేవు. ఈ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు కనీసం పెట్రోలింగ్ కూడా నిర్వహించడం లేదు.

# పొగాకు కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం



సింగరాయకొండ, అక్టోబరు11 (సందేశం టైమ్స్): ప్రకాశం జిల్లాలోని ఓ పొగాకు కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుద్ధి చేసి, ఎగుమతికి సిద్ధంగా ఉంచిన 11 మిలియన్ కేజీల పొగాకు అగ్నికి ఆహుతయింది. వివరాలు.. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కలికివాయి పంచాయతీ పరిధిలో బీకే ట్రెషర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉంది. దీన్ని 2012 నుంచి గాడ్ ఫ్రే ఫిలిప్స్ ఇండియా(జీపీఐ) లిమిటెడ్ కంపెనీ అద్దె ప్రాతిపదికన తీసుకొని వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తోంది. వేకువజామున 3 గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుంది. ఎగుమతికి సిద్ధంగా ఉన్న... కోటి 10 లక్షల(11 మిలియన్) కేజీల పొగాకు ఉంచిన ఏ, బీ ఏసీ గోదాముల నుంచి ఒక్కసారిగా భారీగా అగ్నిజ్వాలలు ఎగిసిపడ్డాయి. సిబ్బంది వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు, టంగుటూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉదయం మంటలు అదుపులోకి వచ్చాయి. ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రూ.550 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు జీపీ ఐ కంపెనీ జీఎం ప్రభాకర్‌రావు పోలీసులకు తెలిపారు. సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదు చేశారు.

# పసివాడిని బలిగొన్న వేడి తేనీరు

## తెలియక తాగేయడంతో గొంతు కాలి ఆగిన ఊపిరి

## ఆస్పత్రి పాలైన మరో చిన్నారి

## అనంతలో విషాదం



యాడికి, అక్టోబరు11 (సందేశం టైమ్స్): ఫ్లాస్క్‌లో పోసి పెట్టిన వేడి టీ తాగి.. నాలుగేళ్ల పసివాడు ప్రాణాలు కోల్పోయాడు. రెండేళ్ల అతడి చెల్లెలు తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిపాలైంది. అనంతపురం జిల్లా యాడికి పట్టణంలో ఈ విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని చెన్నకేశవ కాలనీకి చెందిన రామస్వామి, చాముండేశ్వరి దంపతులకు కుమారుడు రుత్విక్ (4), కూతురు యశస్విని ఉన్నారు. ఈ నెల 8న తల్లిదండ్రులు పనులకు వెళ్లేటప్పుడు ఎప్పటిలానే వేడి వేడి టీ ఫ్లాస్క్‌లో పోసుకుని పక్కన పెట్టారు. ఆ వేడి వేడి టీని పిల్లలిద్దరూ గ్లాస్‌లలోకి ఒంపుకుని తాగారు. దీన్ని కుటుంబ సభ్యులు గమనించలేదు. టీ వేడికి పసివారి గొంతు లోపలిభాగంలో గాయాలయ్యాయి. నొప్పి భరించలేక ఇద్దరూ ఏడుస్తుండటంతో తల్లిదండ్రులు వారిని తాడిపత్రిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఒక రోజు చికిత్స చేసిన వైద్యులు, మరుసటి రోజు అనంతపురం వెళ్లాలని సూచించారు. దీంతో చిన్నారులిద్దరినీ అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రుత్విక్ తెల్లవారు జామున మృతిచెందాడు. యశస్వినికి చికిత్స కొనసాగుతోంది.

# రౌడీషీటర్ హత్య



ఎలమంచిలి, అక్టోబరు11 (సందేశం టైమ్స్):ఇద్దరు రౌడీషీటర్ల మధ్య తలెత్తిన వివాదం అనుకోకుండా ఒకరి మృతికి దారితీసింది. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి విశాఖపట్నంలోని ఎంవీపీ స్టేషన్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ నగరానికి చెందిన ఎన్.గౌరీశంకర్‌పై రౌడ్ షీట్ ఉంది. దీంతో పోలీసులు కొంతకాలం క్రితం నగర బహిష్కరణ చేయడంతో ఎలమంచిలి వచ్చి ఉంటున్నాడు. అతనికి గతంలో విజయవాడ సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ఆర్ పేటకు చెందిన పాత నేరస్థుడు కశింకోట శ్రీధర్‌బాబు(35)తో పరిచయం ఏర్పడింది. ఒక చోరీ కేసులో వీరు నిందితులుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి కోర్టుకు హాజరుకావడానికి ఈ నెల 7వ తేదీన ఇద్దరూ కలిసి కారులో విశాఖ వెళ్లారు. కేసు వాయిదా అనంతరం సీతమ్మధార రైతుబజార్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన తరువాత ఒక మహిళ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో గౌరీశంకర్ తన వద్ద ఉన్న కత్తితో శ్రీధర్‌బాబు చేతిపై తీవ్రంగా గాయపరిచాడు. రక్తస్రావం అవుతుండడంతో ఇద్దరూ కలిసి కారులో సమీపంలోని ఆస్పత్రికి వెళ్లారు. శ్రీధర్‌బాబు గాయానికి కుట్లు వేసిన తరువాత ఇద్దరూ కలిసి కారులో ఎలమంచిలి వైపు బయలుదేరారు. అయితే ఎనిమిదో తేదీ తెల్లవారుజామున దారిలోనే శ్రీధర్‌బాబు మృతిచెందాడు. దీంతో గౌరీశకంర్ కారును అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మునిసిపాలిటీలోని మర్రిబంద సమీపంలోని పోలవరం కాలువ వద్దకు తీసుకువెళ్లి, శ్రీధర్‌బాబు మృతదేహాన్ని అక్కడ పడేశాడు. ఇదిలావుండగా విశాఖ ఎంవీపీ పోలీసులు మరో కేసు విషయమై గౌరీశంకర్‌ను తొమ్మిదో తేదీన అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తుండగా...శ్రీధర్‌బాబు మృతి విషయం బయటపడింది. దీనిపై మరింత లోతుగా విచారించగా..మృతదేహాన్ని ఎలమంచిలి సమీపంలో పడేసినట్టు చెప్పాడు. దీంతో సాయంత్రం ఎలమంచిలి వెళ్లి, స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహం ఉన్న ప్రదేశానికి వెళ్లారు. మృతదేహం బాగా ఉబ్బిపోయి దుర్వాసన వస్తున్నది. శ్రీధర్‌బాబు మృతిగురించి విజయవాడలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

# ఇంజనీరింగ్ కాలేజీలో భారీ చోరీ

**బీరువా బద్దలు కొట్టి రూ.1.7 కోట్ల నగదు అపహరణ**
**సీసీ ఫుటేజీ తాలూకు హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లిన దొంగలు**
**బ్రిలియంట్ ఇంజనీరింగ్ కాలేజీలో ఘటన**




అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలోని బీరువా తాళాలు పగులకొట్టి అందులో ఉన్న రూ.1.7 కోట్లను దొంగలు ఎత్తుకెళ్లారు. ఘటనాస్థలిలో రెండు స్క్రూడ్రైవర్లు కనిపించాయి. వాటితోనే బీరువా తాళాలు పగులగొట్టి ఉంటారని భావిస్తున్నారు. తెలివిగా వ్యవహరించిన దొంగలు.. సీసీ ఫుటేజీ దొరక్కుండా ఉండేందుకు హార్డ్‌డిస్కులను కూడా తమ వెంట పట్టుకెళ్లిపోయారు. గురువారం సాయంత్రం కాలేజీకి తాళాలు వేసి.. శుక్రవారం ఉదయం వచ్చిన సిబ్బంది బీరువా తాళాలు తెరిచి ఉండటాన్ని చూసి కళాశాల యాజమాన్యానికి సమాచారమిచ్చారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫీజులను ఎప్పటికప్పుడు బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేస్తూ వస్తున్నా.. ఈ పనిని పర్యవేక్షిస్తున్న యాజమాన్యంలోని కీలక వ్యక్తి కొన్నాళ్లుగా జ్వరంతో బాధపడుతుంటంతో ఫీజు రూపంలో వచ్చిన డబ్బునంతా కాలేజీలోని బీరువాలోనే దాస్తున్నట్లు తెలిసింది. ఈ సంగతి గుర్తెరిగిన వ్యక్తులే ఈ చోరీకి పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాలేజీ చైర్మన్, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి కళాశాలను సందర్శించి వివరాలు తెలుసుకుని పోలీసులతో మాటాడారు. కళాశాల ప్రిన్సిపల్ వీరన్న ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదైంది.

# భద్రాద్రి రామయ్య సేవలో 225 జంటలు



భద్రాచలం, అక్టోబరు11 (సందేశం టైమ్స్): తమిళనాడు రాష్ట్రానికి చెందిన కించిత్ కారన్ ట్రస్టు భక్త బృందం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ట్రస్టు నిర్వాహకులు వేలుకుడి కృష్ణన్ ఆధ్వర్యంలో 1500 మందిభక్త బృందం పురుషోత్తముడు పేరుతో పిలువబడే క్షేత్రాలను సందర్శించే ప్రక్రియలో భాగంగా పురుషోత్తమ విద్యా యాత్రను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ట్రస్టు సభ్యులు మంగళగిరి, సింహాచలం, శ్రీకూర్మం, పూరి, భద్రాచలం, అహోబిలం క్షేత్రాలను సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం వచ్చిన ట్రస్టు సభ్యులంతా ఉదయం స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం చిత్రకూట మండపంలో స్వామి వారి నిత్య కల్యాణం నిర్వహించగా.. 225 జంటలు కల్యాణంలో పాల్గొన్నాయి. ఇదిలా ఉండగా.. ట్రస్టు సభ్యులు తాము సందర్శించే క్షేత్రాల్లో భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ పారాయణాన్ని నిర్వహిస్తుండడం విశేషం. ఇటీవల కాలంలో అత్యధికంగా నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తుల సంఖ్య ఇదే.

# డ్రగ్స్, హవాలా నెట్‌వర్క్‌ను ఛేదించిన ఈగల్



**దేశవ్యాప్తంగా పలు చోట్ల సోదాలు**
**నెలరోజులుగా తప్పించుకు తిరుగుతున్న**
**హవాలా ఆపరేటర్ ప్రజాపతి ముంబైలో అరెస్టు**

హైదరాబాద్, అక్టోబరు11 (సందేశం టైమ్స్): దేశవ్యాప్తంగా ఉన్న నైజీరియన్ డ్రగ్స్ ముఠా నగదు హవాలా నెట్‌వర్క్‌ను ఈగల్ బృందాలు ఛేదించాయి. ముంబై, ఢిల్లీ, రాజస్థాన్, గోవాలో నైజీరియన్ డ్రగ్స్ స్మగ్లర్లకు సహకరిస్తున్న పలువురు హవాలా ఆపరేటర్ల ఇళ్లు, కార్యాలయాలపై ఈగల్ బృందాలు దాడులు నిర్వహించాయి. డ్రగ్స్, మనీ లాండరింగ్‌లో కీలకంగా వ్యవహరించిన హవాలా ఆపరేటర్ దగ్గారం ప్రజాపతిని ముంబైలో అదుపులోకి తీసుకుని, రూ.3 కోట్లకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నామని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్య ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన దాడుల్లో ప్రజాపతి తమ నుంచి తప్పించుకున్నాడని, అతడి స్నేహితుల కదలికలపై నిఘా ఉంచి తాజాగా అతడిని అరెస్టు చేయగలిగామని వివరించారు. ఈగల్ దాడుల నేపథ్యంలో దాదాపు నెలరోజుల నుంచి తప్పించుకుతిరుగుతున్నాడని, ఫోన్లలో ఉన్న డేటాను డిలీట్ చేసి, కొత్త నంబర్లను వాడుతున్నాడని తెలిపారు. నైజీరియాకు చెందిన మ్యాక్స్‌వెల్ అనే వ్యక్తితో పాటు అతడి బృందం నుంచి డ్రగ్స్ అమ్మగా వచ్చిన నగదును ప్రజాపతి హవాలా మార్గంలో సూరత్, ముంబై, ఢిల్లీలోని వస్త్ర వ్యాపారులకు పంపేవాడని తెలిపారు. నైజీరియన్లు భారత్‌లో డ్రగ్స్ అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో వస్త్రాలను కొనుగోలు చేసి తమ దేశానికి కంటైనర్ల ద్వారా పంపేవారని, ఇదంతా ఒక పెద్ద నెట్‌వర్క్‌గా గుర్తించామని ఆయన వివరించారు. ఈ కేసులో 25 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. విదేశీయులకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు ఇంటి యజమానులు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని ఆయన సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించి ఏ సమాచారం ఉన్నా 1908 నంబర్‌కు ఫోన్‌చేసి తెలియచేయాలని సందీప్ శాండిల్య పేర్కొన్నారు

# బడిలో క్రైస్తవ మతబోధన!



వర్ధన్నపేట రూరల్/ వర్ధన్నపేట, అక్టోబరు11 (సందేశం టైమ్స్): వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని 'ఫుస్కోస్ స్కూల్' అనే ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు క్రైస్తవమత బోధనలు, వారితో ప్రార్థనలు చేయించిన తాలూకు వీడియో బయటపడింది. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. ఆ బడిలోని 1, 6, 8, 9 తరగతులకు చెందిన 20 మంది పిల్లలను ఒకే క్లాసులో కూర్చోబెట్టి.. ప్రిన్సిపల్ మేరీ సమక్షంలో చర్చి ఫాదర్ వేషధారణలో ఉన్న వ్యక్తి మతబోధనలు నిర్వహిస్తున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. శుక్రవారం ఉదయం మొదటి పీరియడ్ కేటాయించిన సమయంలో చర్చి ఫాదర్ పిల్లలకు ఈ మత బోధనలకు సంబంధించిన క్లాసు తీసుకున్నారు. తాము చేసే పనుల్లో, భోజన సమయాల్లో ప్రేయర్ చేయాలంటూ పిల్లలకు ఫాదర్ చెబుతున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. కాగా ఈ ప్రార్థనలు చేయించినట్లుగా చెబుతున్న వ్యక్తి.. ఆ బడికి ఆనుకొని ఉన్న చర్చిలోని ఫాదర్ అని, ఆయన పేరు చిన్నపు రెడ్డి అని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం ఓ విద్యార్థి తండ్రి.. స్కూల్ ఫీజు కట్టేందుకు వెళ్లగా, గదిలో మత బోధనలు జరుగుతుండటాన్ని చూసి.. మొబైల్ ఫోన్లో వీడియో తీశారు. ఆ వీడియోనే బయటకు పొక్కి.. వైరల్ అయింది. ఈ ఘటన పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, హిందూ, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఫుస్కోస్ స్కూల్‌లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఉంది. బడిని క్రైస్తవ మతానికి చెందిన యాజమాన్యమే నిర్వహిస్తున్నా.. అన్ని మతాలకు చెందిన దాదాపు 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ బడిలో ప్రతి బుధ, శుక్రవారాల్లో గుట్టుగా మత బోధనలు జరుగుతున్నాయని.. ఆ సమయాల్లో బయటి వ్యక్తులెవరూ లోపలికి ప్రవేశించకుండా గేట్లు మూసేస్తారని స్థానికులు చెబుతున్నారు. కాగా బయటపడిన వీడియోకు సంబంధించి ప్రిన్సిపల్ మేరీ స్పందించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, విలువైన విషయాలు చెబుతున్నామని, క్రైస్తవ విద్యార్థులకు మాత్రమే మత బోధనలు చేస్తున్నామని రకరకాలుగా మాట్లాడారు. బడిలో మత ప్రచార బోధనలకు సంబంధించిన ఘటనపై ఏబీవీపీ ప్రతినిధులు తహసీల్దార్, ఎంఈవో కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాలపై కేసు నమోదు చేసి.. గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# లొంగిపోండి.. ఏమీ చేయం



హైదరాబాద్,అక్టోబరు11 (సందేశం టైమ్స్): ఆయుధాలను వదిలి, జనజీవన స్రవంతిలోకి రావడానికి ఇష్టపడే మావోయిస్టులకు అడవుల నుంచి సేఫ్ పాసేజ్ ఇస్తామని.. వారికి ఎలాంటి హాని కల్పించబోమని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, మీడియా, రాజకీయ నాయకు లు, బంధుమిత్రుల్లో ఎవరి ద్వారానైనా సరే.. లొంగుబాటు సమాచారం అందిస్తే చాలని ఆయన పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు రాష్ట్ర కమిటీ నాయకులు డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. వారి వివరాలను డీజీపీ శుక్రవారం తన కార్యాలయంలో వెల్లడించారు. ఆ ముగ్గురూ సిద్దిపేట జిల్లా మద్దూర్ మండలం కూటిగల్ గ్రామానికి చెందిన కుంకటి వెంకటయ్య అలియాస్ రమేశ్ అలియాస్ వికాస్, హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన మొగిలిచెర్ల వెంకటరాజు అలియాస్ పున్నంచంద్, ఆయన భార్య తొడెం గంగ. కంటి చూపు మందగించడంతో పాటు పార్టీలో వివిధ విభాగాల్లో వచ్చిన సిద్ధాంతపరమైన విభేదాలతో పున్నంచంద్ భార్యతో కలిసి లొంగిపోవడానికి వచ్చారని.. ఈ ముగ్గురికీ ఒకొక్కరికి రూ.20 లక్షల చొప్పున రివార్డు ను అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తు తం మావోయిస్టు పార్టీలో తెలంగాణ కమిటీలకు సంబం?ధించి 72 మంది అడవుల్లో ఉన్నారని.. కేంద్ర కమిటీలోని 12 మందిలో 8 మంది తెలంగాణ వాసులేనని తెలిపారు. మావోయిస్టు పార్టీలో సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నట్లు లొంగిపోయిన వారు చెపుతున్న విషయాలను బట్టి స్పష్టమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి, అదనపు డీజీ స్వాతి లక్రా తదితరులు పాల్గొన్నారు. లొంగుబాట్లు, ఆయుధాలను వదిలి వేయడానికి సంబంధించి మావోయిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలున్న విషయం సోనూ లేఖ ద్వారా బయటపడినప్పటికీ.. వాటిపై పార్టీలో చాలాకాలంగా సుదీర్ఘ చర్చ జరుగుతోందని లొంగిపోయిన మావోయిస్టు వికాస్ పేర్కొన్నారు. రాజకీయంగా, సామాజికంగా వస్తున్న మార్పులపై పార్టీలో ఎంతోకాలంగా అంతర్మథనం జరుగుతోందని, ఆయుధాలను వదిలి వేసే విషయం కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదని తెలిపారు. పార్టీ లో పాత పరిస్థితులు, ఉద్యమ వాతావరణం ఇప్పు డు లేవని, పాత విధానాలు ఇప్పుడు పనిచేయవనే విషయమై తీవ్ర చర్చ పార్టీలో జరిగిందని చెప్పారు.

# పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు




జగిత్యాల, అక్టోబరు11 (సందేశం టైమ్స్): జిల్లాలో పదో తరగతి ఫలితాలను మెరుగుపరిచే దిశగా విద్యాశాఖ అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించారు. విద్యార్థులు పరీక్ష సమయంలో కాకుండా ఇప్పటి నుంచే అభ్యాసంపై దృష్టి పెట్టేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. డిసెంబరు 31 వరకు ఈ ప్రత్యేక సెషన్లు కొనసాగనున్నాయి. వచ్చే యేడాది జనవరి 1వ తేదీ నుంచి రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి కసరత్తులు జరుగుతున్నాయి. జిల్లాలోని అన్నిప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలు, రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు రెండుసార్లు తరగతులు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు ఉంటాయి. ఈ తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించడం, ఆత్మవిశ్వాసం పెంచడం, సందేహాలు నివృత్తి చేయడం తదితర కార్యక్రమాలు ఉంటాయి.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**మెట్‌పల్లి పాత బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు**
**– జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో రైతుల ధర్నా**

మెట్‌పల్లిటౌన్,అక్టోబరు11 (సందేశం టైమ్స్): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా వచ్చి పాత బస్టాండ్ వద్ద రైతుల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంట చేతికి వచ్చి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ?ధరలు తగ్గించి 1,600 రూపాయలకే కొనుగోలు చేస్తూ రైతులను నట్టెటా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ సీజన్‌లో సన్న బియ్యానికి బోనస్ విడుదల చేయాలని, మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర 2,420 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షం వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దింతో జాతీయ రహదారిపై కాసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ధర్నా విరమించాలని మెట్‌పల్లి సీఐ అనిల్, ఎస్ఐ కిరణ్ కుమార్‌లు రైతులను నచ్చజెప్పినా వినలేదు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన రైతులు, రైతు ఐక్య వేదిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# క్రీడావార్తలు




## బోణీ కొట్టిన కివీస్



గువాహటి: న్యూజిలాండ్ మహిళలు వన్డే ప్రపంచ కప్‌లో ఎట్టకేలకు ప్రపంచ కప్‌లో బోణీ చేశారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం చవిచూసిన కివీస్.. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 100 పరుగులతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. మొదట న్యూజిలాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 227 పరుగులు చేసింది. బ్రూక్ (69), కెప్టెన్ సోఫీ డివైన్ (63) హాఫ్ సెంచరీలతో ఆదుకున్నారు. నాలుగో వికెట్‌కు వీరిద్దరు 112 పరుగులు జోడించడంతో న్యూజిలాండ్ తేరుకుంది. ఛేదనలో కివీస్ బౌలర్ల ధాటికి బంగ్లాదేశ్ 39.5 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. ఫహీమా ఖాతూన్ (34) టాప్ స్కోరర్. రబేయా ఖాన్ (25), నహీదా అక్తర్ (17) మోస్తరుగా ఆడారు. బంగ్లా ఇన్నింగ్స్‌లో రెండో అత్యధిక స్కోరు ఎక్స్‌ట్రాల (30)దే కావడం గమనార్హం.సంక్షిప్తస్కోర్లు: న్యూజిలాండ్: 50 ఓవర్లలో 227/9 (బ్రూక్ హలిడే 69, సోఫీ డివైన్ 63, సుజీ బేట్స్ 29, రబేయా ఖాన్ 3/30)బీ బంగ్లాదేశ్: 39.5 ఓవర్లలో 127 ఆలౌట్ (ఫహీమా ఖాతూన్ 34, రబేయా ఖాన్ 25, నహీదా అక్తర్ 17, జెస్ కెర్ 3/21, లియా తహుహు 3/22, రోస్‌మేరీ 2/20).

## శతక జైస్వాల్ 'డబుల్' దిశగా ఓపెనర్




న్యూఢిల్లీ: వెస్టిండీసతో జరుగుతున్న రెండో టెస్టులోనూ భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (173 బ్యాటింగ్) తన అసాధారణ బ్యాటింగ్ నైపుణ్యంతో డబుల్ సెంచరీ వైపు సాగుతుండగా.. అటు సాయి సుదర్శన్ (87) అర్ధసెంచరీతో ఫామ్‌ను అందుకున్నాడు. దీంతో తొలి రోజు శుక్రవారమే భారత్ పూర్తి పట్టు సాధించింది. తద్వారా ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 318/2 భారీ స్కోరుతో నిలిచింది. క్రీజులో యశస్వీకి జతగా గిల్ (20 బ్యాటింగ్) ఉన్నాడు. స్పిన్నర్ జోమెల్ వారికన్‌కు రెండు వికెట్లు దక్కాయి. మరోవైపు విండీస్ బౌలర్లు తొలి రోజు ఆటలో ఒక్క ఎక్స్‌ట్రా రన్ ఇవ్వకపోవడం విశేషం.ఆరంభంలో ఆచితూచి..: కెప్టెన్‌గా మొదటిసారి టాస్ గెలిచిన గిల్ వెంటనే బ్యాటింగ్‌ను ఎంచుకున్నాడు. అయితే కొత్త బంతిని ఎదుర్కొన్న ఓపెనర్లు జైస్వాల్, రాహుల్ తొలి గంటపాటు నిదానంగా ఆడారు. వారెదుర్కొన్న మొదటి 72 బంతుల్లో 60 డాట్ బాల్స్ ఉండడం గమనార్హం. దీంతో డ్రింక్స్ విరామానికి జట్టు స్కోరు 29/0గానే ఉంది. పేసర్ ఫిలిప్ చక్కటి సీమ్‌తో ఓపెనర్లను ఇబ్బందిపెట్టాడు. కానీ బ్రేక్ తర్వాత స్ట్రయిక్‌ను రొటేట్ చేసుకుంటూ, చెత్త బంతులను ఫోర్లుగా మలుస్తూ చకచకా పరుగులు రాబట్టారు. 17వ ఓవర్‌లో సిక్సర్‌తో జోరు మీదున్న రాహుల్ (38)ను.. స్పిన్నర్ వారికన్ తన తొలి ఓవర్‌లోనే స్టంపౌట్‌గా పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో మొదటి వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఎదుర్కొన్న మొదటి బంతినే ఫోర్‌గా మలిచిన సాయి సుదర్శన్‌తో కలిసి జైస్వాల్ మరో వికెట్ పడకుండా తొలి సెషన్‌ను 94/1 స్కోరుతో ముగించాడు.యశస్వీ-సాయి శతక భాగస్వామ్యం: రెండో సెషన్‌లో పూర్తిగా భారత్ ఆధిపత్యం సాగింది. పిచ్ బ్యాటింగ్‌కు సహకరించడంతో ఇద్దరు లెఫ్ట్‌హ్యాండర్లు జైస్వాల్-సుదర్శన్ శతక భాగస్వామ్యాన్ని అందించారు. తొలి గంటపాటు వీరి దూకుడుకు ఓవర్‌కు ఆరు పరుగుల రన్‌రేట్‌తో స్కోరు దూసుకెళ్లింది. లంచ్ విరామం తర్వాత జైస్వాల్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. విండీస్ బౌలర్లు ఈ జోడీని విడదీసేందుకు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో సాయి కెరీర్‌లో రెండో అర్ధసెంచరీకి చేరుకున్నాడు. అటు తొలి టెస్టులో భారీ స్కోరు అందుకోలేకపోయిన జైస్వాల్ ఈసారి పట్టుదలగా ఆడి కెరీర్‌లో ఏడో శతకం సాధించాడు. అయితే సాయి 58 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను మిడ్ వికెట్‌లో వారికన్ పట్టుకోలేకపోయాడు. రెండో వికెట్‌కు అజేయంగా 162 పరుగులు జోడించాక ఇద్దరూ టీ బ్రేక్‌కు వెళ్లారు.సాయి శతకం మిస్: ఆఖరి సెషన్‌లో బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో భారత్ ఆటలో కాస్త వేగం తగ్గింది. ఇక ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తున్న సాయి సుదర్శన్ కెరీర్‌లో తొలి సెంచరీ చేయడం ఖాయమనిపించింది. కానీ వారికన్ అతడిని దెబ్బతీశాడు. అటు అంపైర్ ఎల్బీ నిర్ణయంపై సాయి రివ్యూ కోరినా ఫలితం లేకపోయింది. రీప్లేలో బంతి లెగ్ స్టంప్‌ను తాకుతున్నట్టుగా తేలడంతో సెంచరీకి 13 రన్స్ దూరంలో సుదర్శన్ పెవిలియన్ చేరాడు. దీంతో రెండో వికెట్‌కు 193 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్లాస్ ఇన్నింగ్స్‌తో జైస్వాల్ ఐదోసారి టెస్టుల్లో 150 రన్స్‌ను పూర్తి చేశాడు. గిల్ కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడడంతో.. తొలిరోజు ఆటను భారత్ మెరుగ్గా ముగించింది.

## మోహిత్ మీట్ రికార్డ్




భువనేశ్వర్: తెలంగాణకు చెందిన మోహిత్ చౌధరి జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. శుక్రవారం ఇక్కడ ప్రారంభమైన మీట్‌లోని అండర్-20 పురుషుల 5వేల మీటర్ల పరుగులో మోహిత్ 14 నిమిషాల 09.71 సెకన్ల రికార్డ్‌తో గమ్యం చేరి అగ్రస్థానంలో నిలిచాడు. దాంతో 14 ని 12.67సె. గత రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా 11 ఏళ్ల రికార్డును హిమాంశు జాఖర్ బద్దలుగొట్టాడు. హరియాణాకు చెందిన హిమాంశు జావెలిన్ త్రో అండర్-18 విభాగంలో 79.96 మీ. దూరంతో సరికొత్త జాతీయ రికార్డుతో స్వర్ణం నెగ్గాడు. దాంతో 2014లో నీరజ్ 76.50 మీ. దూరంతో నెలకొల్పిన రికార్డు కనుమరుగైంది.

## కాస్పరోవ్‌కు మరింత ఆధిక్యం




సెయింట్ లూయిస్ (అమెరికా): భారత దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్‌తో లెజెండ్స్ క్లచ్ చెస్ టోర్నీలో రష్యా జీఎం గ్యారీ కాస్పరోవ్ తన ఆధిక్యాన్ని మరింత పెంచుకున్నాడు. రెండో రోజు జరిగిన నాలుగు గేమ్‌లలో రెండింటిలో కాస్పరోవ్ విజయం సాధించాడు. మరో రెండు గేమ్‌లు డ్రాగా ముగిశాయి. రెండో రోజు నాలుగు గేమ్‌ల్లో 6-2 ఆధిక్యంతో నిలిచిన గ్యారీ..మొత్తం ఎనిమిది గేమ్‌ల తర్వాత 8.5-3.5తో ముందంజలో నిలిచాడు. మూడో.. చివరి రోజు మరో నాలుగు గేమ్‌లు జరగనున్నాయి.

## కాంస్యంతో సరి



గువాహటి: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిపలో భారత షట్లర్ల జైత్రయాత్రకు తెరపడింది. సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఇండోనేసియా చేతిలో ఓటమిపాలై కాంస్యంతో సరిపెట్టుకున్నారు. శుక్రవారం జరిగిన సెమీసలో భారత్ 35-45, 21-45తో పరాజయం పాలైంది. కాంస్యానికి పరిమితమైనా.. ఈ మెగా టోర్నీలో పతకం దక్కడం భారత్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం.

## గదిలో పెట్టి తాళం వేశాడు



దుబాయ్: ఆసియాకప్‌లో విజేతగా నిలిచి రెండు వారాలైనప్పటికీ భారత టీ20 జట్టుకు ఇప్పటిదాకా ట్రోఫీ దక్కలేదు. పాక్‌పై ఫైనల్లో గెలిచాక ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహిసిన్ నఖ్వీ నుంచి తాము ఆ ట్రోఫీ అందుకునేది లేదని కెప్టెన్ సూర్యకుమార్ తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. దీంతో నఖ్వీ వేదికపైనుంచే కప్‌ను తీసుకెళ్లిపోయాడు. తాజా సమాచారం ప్రకారం దాన్ని దుబాయ్‌లోని తన ఏసీసీ ప్రధాన కార్యాలయంలో పెట్టి గదికి తాళం వేశాడట. 'ఇప్పటికీ ట్రోఫీ ఆ ఆఫీసలోనే ఉంది. తన అనుమతి లేకుండా ఆ ట్రోఫీని ఎట్టి పరిస్థితిలో తీయకూడదని, అలాగే ఎవరికీ ఇవ్వకూడదని మాకు ఆదేశాలున్నాయి. ఒకవేళ ఇవ్వాల్సి వస్తే ఎప్పటికైనా దాన్ని స్వయంగా తానే బీసీసీఐకి కానీ భారత జట్టుకు కానీ ఇస్తానని నఖ్వీ తెలిపాడు' అని ఏసీసీ వర్గాలు పేర్కొన్నాయి.

## సింధు మూడోసారి



న్యూఢిల్లీ: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రతిష్టాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) అథ్లెట్ల కమిషన్‌లో మూడోసారి చోటు దక్కించుకుంది. నవంబరు 2025-నవంబరు 2029 కాలానికిగాను బీడబ్ల్యూఎఫ్ శుక్రవారం ప్రకటించిన నూతన సభ్యుల జాబితాలో మరోసారి సింధు పేరును చేర్చారు. తొలిసారిగా 2017లో ఈ కమిషన్‌కు ఎంపికైన సింధు.. ఆ తర్వాత 2021లో రెండోసారి స్థానం దక్కించుకున్న విషయం తెలిసిందే.

## శుభ్‌మన్ గిల్‌కు బిగ్ రిలీఫ్.. తొలిసారి !




కొందరిని కొన్ని విషయాల్లో దురదృష్టం ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది. అయితే అలాంటి వాటిని ఓవర్ కమ్ చేసి..ఫస్ట్ టైమ్ విజయం సాధిస్తే ఆ కిక్కే వేరుంటాది. అలాంటి ఘటనే టీమిండియా యంగ్ ప్లేయర్, టెస్టు కెప్టెన్ శుభ్ మన్ గిల్ విషయంలో జరిగింది. టెస్టు కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన తర్వాత తొలిసారి శుక్రవారం బిగ్ రిలీఫ్ వచ్చింది. అది కూడా టాస్ నెగ్గే విషయంలో కావడం విశేషం. మరి..అసలు సంగతి ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..గత జూన్‌లో టీమిండియా టెస్టు కెప్టెన్ గా శుభ్‌మన్ గిల్ ) ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన తన తొలి టెస్టు సిరీస్‌నే డ్రాగా ముగించాడు. అంతేకాక ఆ సిరీస్ లో టాప్ స్కోరర్‌గా గిల్ నిలిచాడు. ఇప్పుడు మళ్లీ వెస్టిండీస్‌తోటెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టాడు. ఇప్పటికే తొలి మ్యాచ్‌లో గెలిచిన సంగతి తెలిసిందే. శుక్రవారం జరుగుతున్న రెండో మ్యాచ్‌తో కలిపి ఏడు టెస్టులకు గిల్ నాయకత్వం వహించినట్లు అవుతుంది. ఈక్రమంలో తనపై ఇప్పటివరకూ ఉన్న 'టాస్' ఓడే భారాన్ని ఈ మ్యాచ్ తో దించేసుకున్నాడు.టెస్టు కెప్టెన్ గా గత ఆరు మ్యాచుల్లోనూ గిల్ టాస్ ఓడాడు. అయితే ఎట్టకేలకు తన నాయకత్వంలోని ఏడో టెస్టులో శుక్రవారం టాస్ గెలిచాడు. దీంతో అతడిని సహచర ప్లేయర్లు ఆట పట్టించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయింది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, పేసర్ బుమ్రా అక్షర్ పటేల్ తదితరులు గిల్‌ను మ్యాచ్ విజయం సాధించినట్లు అభినందించారు. మరోవైపు టాస్ నెగ్గిన గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. విండీస్‌తో తొలి టెస్టులో బరిలోకి దిగిన జట్టుతోనే భారత్ ఈసారి ఆడుతోంది.

# బిజినెస్



## స్వల్పంగా తగ్గిన బంగారం ధర.. బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గ చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 11న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 23, 700కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 13, 390కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 23, 850కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 13, 540కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 23, 700కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 13, 390కి చేరింది వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

## గోల్డ్ ఈటీఎఫ్‌లు జిగేల్

న్యూఢిల్లీ: బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఎగబాకుతున్న నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)లోకి భారీగా నిధులు వచ్చాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ ఏడాది సెప్టెంబరులో ఇన్వెస్టర్లు గోల్డ్ ఈటీఎఫల్లో కొత్తగా రూ.8,363 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వీటిలోకి వచ్చిన అత్యధిక నెలవారీ పెట్టుబడులివి. ఈ ఆగస్టులో నమోదైన రూ.2,190 కోట్లతో పోలిస్తే గత నెలలో దాదాపు నాలుగు రెట్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతో గోల్ట్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం ఆస్తులు విలువ రూ.90,000 కోట్ల మైలురాయిని దాటింది. వీటితో పాటు ఈక్విటీ, బాండ్లు, గోల్డ్ ఇలా భిన్న ఆస్తుల్లో




పెట్టుబడులకు వీలుండే మల్టీ అసెట్ ఫండ్లలోకి గత నెలలో రికార్డు స్థాయిలో రూ.5,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. కాగా వరుసగా రెండో నెలా ఈక్విటీ ఫండ్లలోకి నిధుల ప్రవాహం తగ్గింది. గతనెలలో వీటిలోకి రూ.30,421 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆగస్టులో నమోదైన రూ.33,430 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే 9 శాతం తగ్గాయి.

## ఇక ప్రైవేట్ రంగం నుంచి పీఎస్‌బీ సారథులు

న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సహా ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల అత్యున్నత శ్రేణి మేనేజ్‌మెంట్ హోదాల్లో ప్రైవేట్ రంగంలోని ప్రతిభావంతులను నియమించుకునేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఇప్పటికే ఎస్‌బీఐలోని నలుగురు మేనేజింగ్ డైరెక్టర్లలో ఒక పోస్టును ప్రైవేట్ రంగానికి కేటాయించారు. ఇప్పటివరకు పీఎసబీల ఎండీ, చైర్మన్ పదవులన్నింటికీ అంతర్గతంగా ఉన్న అర్హులైన అభ్యర్థులనే నియమిస్తూ వచ్చారు. ప్రస్తుతం దేశంలో ఎస్‌బీఐ సహా 11 పీఎసబీలున్నాయి. సవరించిన నియామక మార్గదర్శకాల ప్రకారం ఇక నుంచి ఈ పదవులకు పోటీ చేసేందుకు ప్రైవేట్ రంగంలోని అభ్యర్థులను అనుమతించనున్నారు. ఇందుకు పోటీ పడాలనుకుంటున్న ప్రైవేట్ రంగ అభ్యర్థులకు కనీసం 21 సంవత్సరాల అనుభవం కలిగి ఉ




ండాలి. అందులో 15 సంవత్సరాలు బ్యాంకింగ్ అనుభవం, రెండేళ్లు బోర్డు స్థాయి అనుభవం అయి ఉండాలి. ఈ మార్గదర్శకాలు అమలులోకి వచ్చిన తర్వాత అందుబాటులో ఉన్న తొలి వేకెన్సీ ఎస్‌బీఐ ఎండీ. దీన్ని ప్రైవేటు రంగం నుంచి భర్తీ చేసిన అనంతరం ఏర్పడే ఖాళీలన్నింటినీ పీఎసబీల్లోని అర్హులైన వారితోనే భర్తీ చేస్తారు. ఇక జాతీయ బ్యాంకుల ఈడీల విషయానికి వస్తే ఒక్కో పదవిని ప్రైవేటు రంగ అభ్యర్థులు సహా ఇతర రంగాల్లోని అర్హులకు కేటాయిస్తారు. ప్రస్తుతం పెద్ద జాతీయ బ్యాంకుల్లో నాలుగు ఈడీ పోస్టులు ఖాళీగా ఉ ండగా రెండు పోస్టులు చిన్న పీఎసబీల్లో ఉన్నాయి.

## ఈక్విటీల కంటే బంగారమే ముద్దు

**దేశంలో 34,600 టన్నుల పసిడి**
**విలువ రూ.335.69 లక్షల కోట్లు**
**ఈక్విటీ పెట్టుబడుల కంటే 3.1 రెట్లు అధికం**
**జీడీపీలో పసిడి విలువ 88.8 శాతం**



న్యూఢిల్లీ: మన దేశంలో పసిడి నిల్వలు ఏటేటా పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది జూన్ నెలాఖరు నాటికి మన దేశంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), ప్రజల వద్ద 34,600 టన్నుల పసిడి నిల్వలు ఉన్నట్టు అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ ఒక నివేదికలో తెలిపింది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం చూస్తే దీని విలువ 3,78,500 కోట్ల డాలర్లు. రూపాయల్లో చెప్పాలంటే ఇది దాదాపు రూ.335.69 లక్షల కోట్లకు సమానం. ప్రస్తుతం భారత కుటుంబాలు ఈక్విటీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసిన 1,18,500 కోట్ల డాలర్ల కంటే ఇది 3.1 రెట్లు ఎక్కువ. జీడీపీపరంగా చూసినా పసిడి విలువ ప్రస్తుత జీడీపీలో 88.8 శాతం వరకు ఉ ంటుందని మోర్గాన్ స్టాన్లీ నివేదిక తెలిపింది.వినియోగంలో రెండో స్థానం: ప్రస్తుతం ప్రపంచ పసిడి డిమాండ్‌లో చైనా తర్వాత మన దేశం రెండో స్థానంలో ఉంది. గత ఐదేళ్ల డేటాను పరిశీలిస్తే ప్రపంచ వార్షిక పసిడి కొనుగోళ్లలో చైనా 28 శాతం కొనుగోలు చేస్తుంటే, మన దేశం 26 శాతం వరకు కొనుగోలు చేస్తోందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యుజీసీ) ఒక నివేదికలో తెలిపింది. మన దేశంలో పసిడి నిల్వలు పెద్దగా లేవు. దీంతో దేశ అవసరాల్లో దాదాపు 99 శాతానికి దిగుమతులే దిక్కు. భారత్ ఎంత లేదన్నా ఏటా 750 నుంచి 840 టన్నుల పసిడిని దిగుమతి చేసుకుంటోంది.కారణాలు: మన దేశంలో పండగొచ్చినా, పబ్బమొచ్చినా చిన్నమెత్తు బంగారమైనా లేకుండా ఏ కార్యక్రమమూ పూర్తి కాదు. ఇక ధనత్రయోదశి రోజైతే బంగారం షాపులన్నీ కిటకిటలాడుతుంటాయి. ధర ఎంత పెరిగినా, తాహతుకు తగ్గట్టు కొద్దో గొప్పో బంగారం కొని పెట్టుకోవడం మధ్య, సంపన్న వర్గాల సంప్రదాయం. దీనికి తోడు ఇటీవల పెట్టుబడి లాభాల కోసం బంగారం కొని పెట్టుకునే వారి సంఖ్యా పెరిగి పోయింది. ప్రస్తుతం దేశంలో అమ్ముడయ్యే బంగారంలో 30 శాతం బిస్కెట్లు, కడ్డీలు, నాణేల రూపంలో అమ్ముడవుతోంది. వీటిని కొనేవారిలో ఎక్కువ మంది పెట్టుబడి లాభాల కోసం కొనేవారే. ఆర్థిక అనిశ్చితి, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, స్టాక్ మార్కెట్ ఆటుపోట్లు, ద్రవ్యోల్బణం కూడా చాలా మంది ఇన్వెస్టర్లను పసిడి వైపు చూసేలా చేస్తున్నాయి.

%బంగారం రుణ మార్కెట్ రూ.15 లక్షల కోట్లు..

దేశంలో పసిడి నిల్వలతో పాటు బంగారాన్ని కుదువ పెట్టుకుని అప్పులిచ్చే మార్కెట్ కూడా పెరిగిపోతోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి సంఘటిత రంగంలోని ఈ మార్కెట్ రూ.15 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఇక్రా రేటింగ్ సంస్థ అంచనా. గతంలో అంచనా వేసిన దాని కంటే ఇది ఒక ఏడాది తక్కువ. 2027 మార్చి నాటికి ఇది మరింత విస్తరించి రూ.18 లక్షల కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉందని తెలిపింది. రేసు గుర్రంలా పరుగెడుతున్న బంగారం ధరను దృష్టిలో ఉంచుకుని గత ఏడాది సెప్టెంబరులో విడుదల చేసిన తమ అంచనాలను సవరిస్తున్నట్టు ఇక్రా తెలిపింది.బ్యాంకులదే అగ్రస్థానం: రుణాలివ్వటంలో బ్యాంకింగేతర ఆర్థికేతర సంస్థ (ఎన్‌బీఎఫసీ)లతో పోలిస్తే బ్యాంకులు ముందున్నాయి. 2020 – 25 మ?ధ్య కాలంలో సంఘటిత రంగంలోని ఎన్‌బీఎఫసీల పసిడి రుణాల మార్కెట్ ఏటా సగటున 20 శాతం చొప్పున పెరిగితే, బ్యాంకుల పసిడి రుణాల వితరణ 26 శాతం చొప్పున పెరిగింది. దీంతో ఈ ఏడాది మార్చి నాటికి పసిడి రుణాల మార్కెట్ రూ.11.8 లక్షల కోట్లు ఉంటే, అందులో బ్యాంకుల వాటా 82 శాతానికి చేరినట్టు ఇక్రా తెలిపింది.

## టాటా సన్స్ లిస్టింగ్ జరగాల్సిందే




న్యూఢిల్లీ: టాటా ట్రస్ట్ బోర్డు మీటింగ్ వాడి వేడిగా జరిగినట్లు సమాచారం. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో టాటా గ్రూప్ కంపెనీల మాతృ సంస్థ టాటా సన్స్ షేర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాల్సిందేనని షాపూర్జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్ పట్టుబట్టింది. దీనికి సంబంధించి ఎస్‌పీ గ్రూప్ చైర్మన్ షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ ఒక ప్రకటన విడుదల చేశారు. షేర్లను లిస్ట్ చేస్తేనే టాటా సన్స్ ఈక్విటీలో 66 శాతం వాటా ఉన్న టాటా ట్రస్ట్ ట్రస్టీల ఇంటి పోరుకు తెరపడి, కంపెనీ నిర్వహణలో పూర్తి పారదర్శకత ఏర్పడుతుందని ఆయన స్పష్టం చేశారు. టాటా సన్స్ ఈక్విటీలో ఎస్‌పీ గ్రూప్ 18.37 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఉంది. ఈ నేపథ్యంలో ఎస్‌పీ మిస్త్రీ చేసిన ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్‌బీఐ ఆదేశించినా గత నెలాఖరులోగా టాటా సన్స్ కంపెనీ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయించలేక పోవడంపైనా మిస్త్రీ ఈ సమావేశంలో ట్రస్టీలను నిలదీసినట్టు సమాచారం. ఇప్పటికైనా వీలైనంత త్వరగా టాటా సన్స్ లిస్టింగ్ పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ చర్య టాటా గ్రూప్ లిస్టెడ్ కంపెనీల్లో వాటాలు ఉన్న 1.2 కోట్ల మంది వాటాదారులకూ మేలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. టాటా ట్రస్ట్ ట్రస్టీల ఇంటిపోరుతో చైర్మన్ నోయెల్ టాటా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్ కూడా ఇటీవల జరిగిన భేటీలో టాటా ట్రస్ట్ చైర్మన్ నోయెల్ టాటా, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌లను నిలదీసినట్టు సమాచారం. ఈ ఇంటిపోరు ముదిరితే దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానంలో ఉన్న టాటా గ్రూప్ కంపెనీల పనితీరుపైనా ప్రభావం పడుతుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

## టీటీకే ప్రెస్టీజ్ ఎమిరిటస్ చైర్మన్ టీటీ జగన్నాథన్ కన్నుమూత

న్యూఢిల్లీ: కిచెన్ మొఘల్‌గా సుప్రసిద్ధుడైన టీటీకే ప్రెస్టీజ్ ఎమిరిటస్ చైర్మన్ టీటీ జగన్నాథన్ శుక్రవారం బెంగళూరులో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 77 సంవత్సరాలు. ఆయన చెన్నై ఐఐటీ గోల్డ్ మెడలిస్ట్ కావడమే కాకుండా కార్నెల్ యూనివర్శిటీ డాక్టరేట్ కూడా పొందారు. గత 50 సంవత్సరాలుగా ఆయన తన తాత, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి టీటీ కృష్ణమాచారి స్థాపించిన టీటీకే ప్రెస్టిజ్ కంపెనీ బోర్డులో ఉన్నారు. 1975లో టీటీకే ప్రెస్టీజ్ ఎండీగా బాధ్యతలు చేపట్టిన జగన్నాథన్ 2000 సంవత్సరం వరకు అదే పదవిలో కొనసాగారు. ఆ తర్వాత 2019 వరకు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఉన్నారు. అనంతరం నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్/చైర్మన్‌గా కొనసాగారు. ఈ ఏడాది మార్చి 25న చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దివాలా దశలో ఉన్న టీటీకే ప్రెస్టీజ్ కంపెనీని బిలియన్ డాలర్ కంపెనీగా తీర్చిదిద్దటంలో జగన్నాథన్ కీలక పాత్ర పోషించారు.




ఆయన సారథ్యంలో కంపెనీ విభిన్న ఉత్పత్తులను మార్కెట్లోకి ప్రవేశపెట్టడం ద్వారా చిన్న గృహోపకరణాల విభాగంలో అగ్రగామిగా నిలిచింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006